సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



వణికిస్తున్న చలి 8లో

జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.



పండగల వేళ ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు. 8లో



హుండీ ఆదాయం రూ.2.81 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి హుండీ ఆదాయం 39 రోజులకు గాను రూ.2,81,93, 913 వచ్చింది.

న్యూస్‌రీల్

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు



మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్

మోతుగూడెం: మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలిశాయి. మోతుగూడెం పంచాయతీ పరిధిలో మోతుగూడెం, పొల్లూరు వెళ్లే రహదారిలో వీటిని అతికించారు. మావోయిస్టులు డిసెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపట్టిన వారోత్సవాలకు వ్యతిరేకంగా, మావోయిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఈ పోస్టర్లను ముద్రించారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట(విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె చాంబర్ సమీపంలోని వీసీ హాలు, జెడ్పీ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

త్వరితగతిన ఇంజినీరింగ్ పనులు పూర్తి



మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. ఐటీడీఏ సమావేశం హాల్‌లో సోమవారం ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీవో మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో చేపట్టిన మైనర్ ఇరిగేషన్ చెక్‌డ్యామ్ పనులు, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ విభాగాల ద్వారా మంజూరు చేసిన పనులపై ఆరా తీశారు. సమావేశంలో ఈఈ గాబ్రియేలు, డీఈలు సాయి సతీష్, చైతన్య, మల్లికార్జునరావు, దివాకర్, వెంకటరమణ, నాగరాజు, ఏఈలు శ్రీనివాసరావు, వంశీ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అంతర జిల్లా డిప్యుటేషన్‌లు రద్దు చేయాలి



రంపచోడవరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్‌టీలను వేరే జిల్లాలకు డిప్యుటేషన్‌పై పంపడం తగదని, వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలాన్ని కోరారు. ఇక్కడ పనిచేస్తున్న సీఆర్‌టీలు, ఉపాధ్యాయులను గుంటూరు, కృష్ణ, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు అక్రమంగా డిప్యుటేషన్ వేయడాన్ని వారు ఖండించారు. డిప్యుటేషన్లను తక్షణం రద్దు చేయాలని కోరుతూ పీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, కె. ఆదిరెడ్డి, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఈ ఏడాది కాఫీ విరగ్గాసింది. ఎక్కడ చూసినా ఎర్రటి పండ్లతో తోటలు కళకళలాడుతున్నాయి. తోటలు మంచి కాపుకాయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థలు కూడా పండ్ల దశలోనే కొనుగోలు చేస్తుండ**దంతో వాటి సేకరణను రైతులు ప్రారంభించారు. తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన వర్షాలు అనుకూలంగా ఉండడంతో కాఫీ పంట విరగ్గాసిందని కాఫీ విభాగం అధికారులు అంటున్నారు.**



కాఫీ రైతు హ్యాపీ

విరగ్గాసిన పండ్లు • సేకరణ ప్రారంభం

పండ్ల దశలోనే కొనుగోలుకు ప్రైవేట్ సంస్థల మొగ్గు

సాక్షి,పాడేరు: అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి పొందిన జిల్లాలో కాఫీకి ఈఏడాది కూడా మహర్దశ పట్టింది. కాయలు పక్వానికి వచ్చాయి. తోటల్లో విరగ్గాసిన ఎర్రని కాఫీ పండ్ల సేకరణను గిరిజన రైతులు ప్రారంభించారు. కాఫీ పంటను పండ్ల దశలోనే పాడేరు ఐటీడీఏతో పాటు గిరిజన రైతు ఉత్పత్తి సంఘాలు,పలు ఎన్‌జీవో సంస్థలు కొనుగోలు ప్రారంభించాయి. చింతపల్లి మాక్స్ సంస్థ ద్వారా పాడేరు ఐటీడీఏ రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. కాఫీ పండ్ల సేకరణలో కాఫీ రైతులు వారం రోజుల నుంచి బిజీగా ఉన్నారు. సేకరించిన పండ్లను ఐటీడీఏతో పాటు పలు సంస్థలు వెంటనే కొనుగోలు చేస్తూ పల్పింగ్ యూనిట్లకు తరలిస్తున్నాయి. జీసీసీ సిబ్బంది కూడా కాఫీ గింజలు కొనుగోలు చేస్తున్నారు.

1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం



పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో 2.42 లక్షల ఎకరాల్లో కాఫీతోటలను గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు.వీటిలో 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇచ్చే కాఫీతోటలు ఉన్నాయి. ఆయా తోటల్లో కాఫీ పండ్లు విరగ్గాయడంతో గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గత ఏడాది 17వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను రైతులు విక్రయించారు. ఈ ఏడాది కూడా కాపు ఆశాజనకంగా ఉండడంతో 18వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీ గింజల ఉత్పత్తి ఉంటుందని.కేంద్ర కాఫీబోర్డు, పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు మండలం గుర్రగరువు ప్రాంతంలో కాఫీ పండ్లను సేకరిస్తున్న మహిళ

ఐటీడీఏ ప్రకటించిన మద్దతు ధరలు (కిలో)

కాఫీ పండ్లు	: రూ.44
పార్చ్‌మెంట్ గింజలు	: రూ.285
అరబికా చెర్రీ	: రూ.150
రోబస్ట చెర్రీ	: రూ.80

గత ఏడాది విక్రయం	ఈ ఏడాది అమ్మకాల అంచనా	ఏడాదిలో మొత్తం లావాదేవీలు
17 వేల మెట్రిక్ టన్నులు	18 వేల మెట్రిక్ టన్నులు	రూ.400 కోట్లు (అంచనా)

జీసీసీ,ఐటీడీఏలు గిట్టుబాటు ధరల ప్రకటన

ఈఏడాది కూడా గిరిజన రైతులు ఉత్పత్తి చేసే కాఫీ పంటకు ఎఫెక్స్ కమిటీ సిఫారసు మేరకు జీసీసీ,పాడేరు ఐటీడీఏలు గిట్టుబాటు ధరలను ప్రకటించాయి.చింతపల్లి మాక్స్ సొసైటీ ద్వారా కొనుగోలు చేసే కాఫీ పండ్లకు కిలో రూ.44ధర చెల్లించేందుకు పాడేరు ఐటీడీఏ నిర్ణయించింది. పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285 ధరతో, అరబికా చెర్రీ రకాన్ని కిలో రూ.150,రోబస్ట చెర్రీ రకాన్ని కిలో రూ.80కు కొనుగోలు చేయనున్నారు. డ్రైకాఫీ దిగుబడి ఎకరాకు 150 కిలోల వరకు ఉంటుంది. ఐటీడీఏ ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఎకరాకు సుమారు రూ.40 వేల నుంచి 45 వేల వరకు రైతుకు ఆదాయం లభిస్తుంది. ఈ ఏడాది రూ. 8 కోట్లతో పండ్లు కొనుగోలు చేయాలని లక్ష్యంగా ఐటీడీఏ నిర్ణయించుకోగా, రూ. 57 కోట్ల లావాదేవీలు నిర్వహించాలని జీసీసీ భావిస్తోంది. జిల్లా మొత్తం ఈ ఏడాది రూ.400 కోట్ల వరకూ కాఫీ లావాదేవీలు జరగవచ్చని భావిస్తున్నారు.

పండ్ల సేకరణ ప్రారంభించాం



నాకు ఉన్న రెండు ఎకరాల్లో కాఫీ తోటలు విరగ్గాసాయి. కాపు ఆశాజనకంగా ఉంది.రెండు రోజుల నుంచి పండ్ల సేకరణ జరుపుతున్నాం.గత ఏడాది కాఫీ పంట విక్రయం ద్వారా రూ.70వేల ఆదాయం వచ్చింది. ఈ సారి కాపు అధికంగా ఉండడంతో దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నాను.సొంతంగా పల్పింగ్ చేసి పార్చ్‌మెంట్ కాఫీని తయారు చేసి జీసీసీకే విక్రయిస్తాను.

– సుర్ర చిట్టిబాబు, కాఫీ రైతు, కరకపుట్టు, పాడేరు మండలం

కాఫీ పంటకు గిట్టుబాటు ధర



గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ పంట నాణ్యతలో నంబర్–1గా నిలుస్తుంది. కాఫీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. ఐటీడీఏ,జీసీసీ యంత్రాంగం ద్వారా కాఫీ రైతులకు మేలు చేసేలా గిట్టుబాటు ధరలను ప్రకటించాం.గిరిజనులు ఎలాంటి అపోహలకు గురికాకుండా కాఫీ పండ్లను ఐటీడీఏకు,పార్చ్‌మెంట్,అరబికా, రొబస్ట కాఫీ గింజలను జీసీసీకి విక్రయించి లాభాలు పొందాలి.దళారీలను ఆశ్రయించి మోసపోవద్దు.

–ఎ.ఎస్.దినేష్‌కుమార్, కలెక్టర్.

మృత్యుపాశం

- పేదింట పెను విషాదం
- విద్యుత్ షాక్‌తో ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి
- తల్లి, ఇద్దరు బిడ్డల మరణంతో శోకసంద్రంలో గడుగుపల్లి

వ్యవసాయ పనులు చేసుకుంటూ.. ఊరికి దూరంగా నిర్మించుకున్న చిన్న ఇంట్లో నివాసముంటున్న ఆ కుటుంబంలో విద్యుత్ ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. తల్లీ,అభం,శుభం తెలియని ఇద్దరు బిడ్డలను కరెంట్ కాటేసింది. విద్యుత్ తీగలే యమపాశాలై వారి ప్రాణాలను హరించివేశాయి. కళ్లముందే తన పెద్ద బిడ్డ విద్యుత్ షాక్‌కు గురై గిలగిలాకొట్టుకుంటూ ఉండగా తల్లడిల్లిన ఆ తల్లి కూడా కాపాడే ప్రయత్నంలో మరణించింది. ఏమైందో తెలియక వారిని వద్దకు చేరిన మరో ఆడబిడ్డ వారితో పాటు పరలోకానికి పయనమైంది. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడడంతో గడుగుపల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతదేహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రంగారావు,ఎస్‌ఐ రమణ(ఇన్‌సెట్) రోదిస్తున్న తండ్రి మోహనరావు

సాక్షి,పాడేరు/పెదబయలు: పెదబయలు మండలం మారుమూల కిముడుపల్లి పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో ఊరికి దూరంగా మట్టిగోడలతో చిన్న ఇల్లు నిర్మించుకుని కొర్రా మోహనరావు అనే ఆదివాసీ గిరిజనుడు భార్య,నలుగురు బిడ్డలు, తన తల్లితో నివాసముంటున్నాడు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం నిత్యావసర సామగ్రి కోసం పెదబయలు సంతకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి వద్ద అతని భార్య లక్ష్మి(35),పెద్ద కుమారుడు సంతోష్‌కుమార్(13),పెద్ద కుమార్తె అంజలి(10) ఉండగా, ఇంటికి సమీపంలో మరో ఇద్దరు బిడ్డలు కోమలి,నగేష్, మోహన్‌రావు తల్లి కొర్ర సన్నయ్ ఉన్నారు. లక్ష్మి దుస్తులు ఉతికి ఆరబెడుతున్న సమయంలో ఇంటి వరండాలో ఉన్న విద్యుత్ వైర్లను పెద్దకుమారుడు సంతోష్‌కుమార్ తాకడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన లక్ష్మి, కుమారుడిని కాపాడే ప్రయత్నంలో విద్యుత్‌ఘాతానికి గురైంది. వీరిద్దరికీ ఏమైందో తెలియక వారి చెంతకు వెళ్లి అంజలి కూడా షాక్‌కు గురైంది. దీంతో ముగ్గురూ మరణించారు. ఇంటి వరండాలో విద్యుత్ వైర్లు సక్రమంగా లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు గ్రామస్తులు తెలిపారు. ఊరికి దూరంగా వీరి నివాసం ఉండడంతో ప్రమాదాన్ని సకాలంలో గ్రామస్తులు గుర్తించ లేకపోయారు.పశువుల కాపరి కోటేశ్వరరావు దూరం నుంచి ఈ ముగ్గురిని గమనించి, గ్రామస్తులకు తెలియజేయడంతో పాటు మోహనరావు తల్లి,మరో ఇద్దరు బిడ్డలు కోమలి,నగేష్‌లను కాపాడాడు. భార్య,ఇద్దరు పిల్లల మృతి చెందడంతో మోహనరావు గుండెలవిసేలా రోదించాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ రంగారావు,ఎస్‌ఐ రమణ,సర్పంచ్ శోభరాణి,వీఆర్వో సంధ్య అక్కడకు చేరుకున్నారు.తల్లీబిడ్డల మృతదేహాలను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి, శవ పరీక్షల గదిలో భద్రపరిచారు. ఆస్పత్రికి విద్యుత్‌శాఖ అధికారులు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



పాడేరు జిల్లా ఆస్పత్రిలోని శవ పరీక్షల గదికి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

విచారం వ్యక్తం చేసిన అరకు ఎంపీ,ఎమ్మెల్యేలు

విద్యుత్ ప్రమాదంలో తల్లి, ఇద్దరు బిడ్డలు మృతిచెందడంపై అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి,అరకు,పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం,మత్స్యరాస విశ్వేశ్వరరాజు,ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు,ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు విచారం వ్యక్తం చేశారు.బాధిత ఆదివాసీ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు, సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- 13న ధాన్యం సేకరణపై కలెక్టర్లకు వినతి పత్రాల అందజేత
- 27న పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిరసన
- జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ ముఖ్యనేతలు

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 13 నుంచి జనవరి 3వ తేదీ వరకు వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపట్టనున్నట్లు శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కార్యాచరణను ప్రకటించిందన్నారు. ఈ నెల 13న ధాన్యం సేకరణపైన, 27వ తేదీన పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా, జనవరి 3వ తేదీన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశమై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ జి.మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, రమణమూర్తిరాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, శోభా హైమావతి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జెడ్పీ వైస్ చైర్మన్ గురిబాబు, బి.సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు జాన్ వెస్లీ, పివిఎస్ఎన్ రవి, శోభాస్వాతి రాణి , చొక్కాకుల వెంకటరావు, పేర్ల విజయ్‌చంద్ర, పోతిన శ్రీనివాసరావు, సుజాత సత్యనారాయణ, బొడ్డేడ ప్రసాద్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, గొల్లగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏడు రోడ్లకు డీఎల్‌సీ ఆమోదం

- సత్వరం పనులు ప్రారంభించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఏడు రోడ్ల నిర్మాణానికి జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌సీ) సమావేశంలో ఆమోదం తెలిపారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, అటవీశాఖల అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎల్‌సీలో ఆమోదం పొందిన మాడగడ నుంచి అరకురోడ్డు, డుంబ్రిగుడ మండలం గుల్లి నుంచి దబ్బగరువు, జోలగుడ నుంచి డుంబ్రిగుడ, లోతేరు నుంచి చెల్లుబడి, కటికి,తారాబు జలపాతాల రోడ్లు,కర్రిగుడ నుంచి చిన్నకోవెల రోడ్ల పనులను సత్వరం చేపట్టాలన్నారు. మారుమూల రహదారుల నిర్మాణాలకు గ్రామసభల అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అటవీ, రెవెన్యూ, ఇంజినీరింగ్‌శాఖల అధికారులు సంయుక్తంగా రహదారులపై సర్వే చేసి ఫారం-ఎలో అటవీశాఖకు పంపాలని,అలాగే అటవీశాఖ కూడా ఫారం-ఎను పరిశీలించి జాప్యం చేయకుండా ఫారం-బిలో అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు.సెల్‌టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తామన్నారు. ఈసమావేశంలో జేసీ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో పద్మలత,గిరిజన సంక్షేమశాఖ ఈఈలు డేవిడ్‌రాజు,కె.వేణుగోపాల్,సబ్ డీఎఫ్‌వో ఉమామహేశ్వరి,వర్చువల్‌లో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, అపూర్వభరత్, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ సమీక్షించారు. మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన వన, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పౌర సరఫరాలు, ఎస్‌ఎంఐ సెరీకల్చర్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నైపుణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్షించారు. అమరావతిలో ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టర్లతో ముఖ్యమంత్రి నిర్వహించనున్న సమావేశంలో చర్చించవలసిన అంశాలపై అధికారులతో ముందుగా సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, రహదారుల నిర్మాణాలు, భవన నిర్మాణాలు, తాగునీటి పథకాలపై కలెక్టర్ల సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు కె.వేణుగోపాల్, జి.డేవిడ్‌రాజ్, రహదారులు భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ జవహర్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, సెరీకల్చర్ ఏడీ అప్పరావు, డీసీహెచ్ఎస్ కృష్ణరావు, డీఎల్‌పీవోపీ ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. అరకులోయ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలు, అరకులోయ పార్లమెంటు నియోజవర్గం పరిధిలో వినియోగించిన ఈవీఎంలను గోదాముల్లో భద్రపరిచారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గోదాములకు వేసిన సీళ్లు, తాళాలను తెరచి ఈవీఎంలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశామని పార్టీల ప్రతినిధులు గోదాముల వద్ద చేపట్టిన భద్రతా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, పాడేరు తహసీల్దార్ వంజంగి త్రినాథరావు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, ఆమ్‌ఆద్మీరాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వణికిస్తున్న చలి

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఉదయం సమయంలో పొగమంచు కురుస్తుండడంతో పాటు సాయంత్రం 4గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఈ నెల మొదటి వారంలో ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల వరకూ పెరగగా ఇప్పుడు మళ్లీ తగ్గుతున్నాయి. దీంతో ఏజెన్సీని సందర్శించే పర్యాటకులతో పాటు స్థానిక గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.రాత్రి, తెల్లవారు సమయంలో చలితీవ్రత అధికంగా ఉంటోంది.ఏజెన్సీలో అత్యల్పంగా జి.మాడుగుల మండలంలో 13.9 డిగ్రీలు నమోదు కాగా,పెదబయలులో 15.7, పాడేరు,డుంబ్రిగుడ,ముంచంగిపుట్టు,డుంబ్రిగుడ మండలాల్లో 15.9, అనంతగిరిలో 16.1, అరకులోయలో 16.4, హుకుంపేటలో 16.5,పాడేరు మండలం మినుములూరు 17,జి.కె.వీధి 17.3,చింతపల్లి 17.7డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి.

'కౌశల్'లో విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్ర ప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన జరిగిన జిల్లా స్థాయి కౌశల్- 2024 ప్రతిభ అన్వేషణ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల ఫలితాలను సోమవారం నిర్వాహకులు ప్రకటించారు. క్విజ్ విభాగంలో 8వ తరగతి నుంచి టి.రోహిత (జెడ్పీహెచ్ఎస్ కణితి), కె.డానియల్ (కేడీపీఎం హైస్కూల్) ఎంపికయ్యారు. 9వ తరగతి నుంచి డి.మనోజ్ (భీమిలి మున్సిపల్ హైస్కూల్), ఐ.సోనియా (కేజీబీవీ, భీమిలి), 10వ తరగతి నుంచి అశ్విని (జెడ్పీహెచ్ఎస్, రేవడి), పి.సాయివర్ధన్ (మున్సిపల్ హైస్కూల్ చిట్టివలస) ఎంపికయ్యారు. పోస్టర్ విభాగంలో 8వ తరగతి నుంచి చైత్ర వర్షిణి (జెడ్పీహెచ్ఎస్, అడవివరం), ఐ.మహిత (క్వీన్ మేరీ స్కూల్), 9వ తరగతి నుంచి పి.చరణ్ కుమార్ (మధురానగర్ మున్సిపల్ స్కూల్), ఎస్.విజయ్ దుర్గ (మున్సిపల్ హైస్కూల్, 14వ వార్డు) ఎంపికయ్యారు. 10వ తరగతి రీల్ విభాగంలో ఎల్.కౌశిక్ (జెడ్పీహెచ్ఎస్ నడుపూరు), బి.కృష్ణ హరిణి (జెడ్పీ హైస్కూల్, చిట్టివలస) గెలుపొందారు. జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి, వివిధ పాఠశాల హెచ్ఎంలు, సమన్వయకర్తలకు స్టేట్ అకాడమిక్ మానిటరింగ్ సభ్యుడు శ్రీనివాసరావు, జిల్లా సమన్వయకర్త నాగేశ్వరరావు, జిల్లా సహ సమన్వయకర్త ఎ.రామలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 29, 30 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం కావాలని సూచించారు.

- ఏయూ స్నాతకోత్సవంపై కానరాని స్పష్టత
- గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్, 2 వేలకు పైగా దరఖాస్తులు
- వర్సిటీ అధికారుల తాత్సారంతో ఓడీలు తీసుకుంటున్న వైనం
- డాక్టరేట్ పట్టభద్రులకూ తప్పని నిరీక్షణ
- చెల్లించిన ఫీజేదంటున్న విద్యార్థులు



ఆంధ్ర విశ్వవిద్యాలయం

ఆచార్యా... పట్టా ఇచ్చేదెప్పుడో..!

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీకి త్వరలోనే తీపి కబురు వస్తుంది.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేదికపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్న మాట ఇది. రెగ్యులర్ వీసీ పోస్టు భర్తీ కోసమే ఈ వ్యాఖ్యలు చేశారని, వర్సిటీ అధికారుల్లో చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి ప్రచారమే జరుగుతోంది. రెగ్యులర్ వీసీ వస్తే తమ సీటుకు గ్యారెంటీ లేదనే శంకతో విభాగాధిపతులంతా స్తబ్దుగా ఉంటున్నారు. దీంతో ఏయూ పాలన ఒకడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది. కీలక నిర్ణయాలకూ అధికారులు వెనుకంజ వేస్తున్నారు. వర్సిటీ స్నాతకోత్సవ(కాన్వొకేషన్) వ్యవహారమే ఇందుకు తార్కాణం.

గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్

ఏయూ 91, 92వ స్నాతకోత్సవానికి 2023 సెప్టెంబర్ 6న నోటిఫికేషన్ జారీ చేశారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, డాక్టరేట్(పీహెచ్‌డీ) ఉత్తీర్ణత సాధించిన వారికి ఈ వేదికపై పట్టాలు అందిస్తామని ప్రకటించారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కోసం వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి సమగ్ర వివరాలు కావాలని సర్క్యులర్ కూడా జారీ చేశారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, వెనువెంటనే వీసీని మార్చేయడంతో స్నాతకోత్సవానికి బ్రేకులు పడ్డాయి.

చెల్లించిన డబ్బులు మాటేంటి?

స్నాతకోత్సవ వేదికపై పట్టా తీసుకోవాలనే ఆసక్తితో ఒక్కో విద్యార్థి రూ.వెయ్యి చొప్పున వర్సిటీకి ఫీజు చెల్లించారు. ఇది ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ఓడీలు తీసుకున్న విద్యార్థులతోపాటు, ఫీజు చెల్లించిన మరి కొందరు తమ డబ్బులు తిరిగివ్వాలని కోరుతున్నారు. వర్సిటీ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసినందున నిర్వహించటమో, లేదంటే వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించడమో చేయాలి. వర్సిటీ అధికారులు కనీస కసరత్తు చేయకపోవటంపై విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్నాతకోత్సవ నిర్వహణపై స్పష్టత కోరుతూ, వర్సిటీ అధికారుల తీరును ఎండగడుతూ, కొంతమంది విద్యార్థులు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు.

అడిగిన వారికి ఓడీలు

కాన్వొకేషన్‌కు పరీక్షల విభాగం పరంగా అంతా సిద్ధం చేశాం. అయితే, దీన్ని ఎప్పుడు నిర్వహిస్తారనేది వర్సిటీ పెద్దలే చెప్పాలి. ఓడీ కావాలని వచ్చిన వారికి, ఇచ్చేస్తున్నాం. ఇలా చేయటం వల్ల దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంతమంది ఇంకా మిగిలారనే లెక్క స్పష్టంగా చెప్పలేం. వారు చెల్లించిన ఫీజు వాపసు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– టి.చిట్టిబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్, ఏయూ

పట్టభద్రుల్లో తీవ్ర నిరాశ

స్నాతకోత్సవ వేదికపై పట్టా అందుకోవడాన్ని జీవితకాల మధురానుభూతిగా విద్యార్థులు భావిస్తారు. రీసెర్చ్ స్కాలర్(పీహెచ్‌డీ)లైతే వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు. ప్రస్తుత ఏయూ అధికారుల నిర్వాకంతో పట్టభద్రులకు నిరాశే మిగులుతోంది. స్నాతకోత్సవ నిర్వహణకు వర్సిటీ నోటిఫికేషన్‌తో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ హోల్డర్లు 2 వేలకు పైగానే దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ జారీ అయి ఏడాదవుతున్నా ఇంకా స్పష్టత లేదు. దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగ అవసరాల రీత్యా చాలా మంది వర్సిటీకి వచ్చి ఒరిజినల్ డిగ్రీల(ఓడీ)ను తీసుకుపోతున్నారు.


ఓడీల కోసం వచ్చిన విద్యార్థులు

అశోక్ సేవలు మరువలేనివి


ఐటీడీఏ పీహెచ్‌వో అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీఓ అభిషేక్ తదితరులు


సంతాప సభకు హాజరైన ఐటీడీఏ ఉద్యోగులు

పాడేరు : ఐటీడీఏ పీహెచ్‌వోగా పనిచేస్తూ గుండెపోటుతో ఆకస్మాత్తుగా మృతి చెందిన అశోక్ సేవలు మరువలేనివని ఐటీడీఏ పీఓ అభిషేక్ అన్నా రు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో పీహెచ్ఓ అశోక్ సంతాప సభను సోమవారం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ అభిషేక్. ఏపీఓలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ఏఓ హేమలత తదితరులు అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐటీడీఏ పీఓ అభిషేక్ మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ అభివృద్ధికి అశోక్ ఎనలేని కృషి చేశారన్నా రు. కాఫీ రైతులు, అధికారులు, తోటి సిబ్బందితో ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారని గుర్తు చేశారు. సాధారణ ఎన్నికల్లో ఎన్నికల పరిశీలకులకు లైజన్ అధికారిగా విజయవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. అశోక్ చేసిన సేవలు మరువలేనివన్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఐటీడీఏ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: అనుమానిత మత్తు పదార్థం కలిగిన ఇద్దరు యువకులను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్.ఐలు సింహాచలం, రాము ఇతర సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా..వీరిని చూసి ఇద్దరు యువకులు పారిపోవడానికి ప్రయత్నించారు. అలెర్ట్ అయిన పోలీసులు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. చిన్న పొట్లంలో అనుమానిత మత్తు పదార్థాన్ని గుర్తించారు. ఆరా తీయగా గోవా నుంచి తీసుకువస్తున్నామని వారు తెలిపారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ద్వారకానగర్‌కు చెందిన కండిపల్లి రామతేజ, పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం, లక్ష్మీపురానికి చెందిన దూస అనిల్ అలియాస్ అనిల్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గిరిజన రైతులను ప్రోత్సహించాలి

ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్,(అరకులోయ రూరల్): రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. గ్రామీణ యువజన వికాస్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజారావు ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు ఐటీడీఏ కార్యాలయంలో పీవో అభిషేక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ నిర్వహిస్తున్న సేవల వివరాల పత్రాన్ని పీవోకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ రాజారావు మాట్లాడుతూ ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతో పాటు నాబార్డ్ సహకారంతో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పతులను మార్కెటింగ్ చేయడం, ప్రభుత్వ ధరలకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. అరకులోయ, పాడేరు కేంద్రాల్లో తమ బ్యాంకు ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. గిరిజన రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్టు తెలిపారు. దళారుల బెడద లేకుండా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి మార్కెటింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి సాగుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ గ్రామాల్లో సంస్థ సేవలను విస్తరించి, గిరిజన రైతులకు సాగుపై ప్రోత్సహించాలన్నారు. సంస్థ ప్రతినిధులు అప్పన్న, శ్రీహరి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవో అభిషేక్‌కు పత్రాన్ని అందజేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు

సోలార్ ప్లాంట్లలో చోరీపై ఫిర్యాదు

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో సోలార్ ప్లాంట్ల అపహరణపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ డీఈఈ కె.సాని రాంబాబు, ఏఈఈ వనుము ప్రభాకర్ తెలిపారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు ప్రభుత్వం 2017లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. చింతపల్లి మండలంలో 20 ప్లాంట్లు, జీకే వీధి మండలంలో 76 ప్లాంట్లను ఏర్పాటు చేశారు. 2020లో ఆయా గ్రామాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించింది. దీంతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. దీనిని అదునుగా భావించిన కొంత మంది విద్యుత్ శాఖ సిబ్బందిగా అవతారమెత్తి చింతపల్లి మండలంలో 14, జీకే వీధిలో 70 సోలార్ విద్యుత్ ప్లాంట్లలోని బ్యాటరీలు, సోలార్ ప్లేట్లు అపహరించి మైదాన ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని డీఈఈ, ఏఈఈ తెలిపారు. దీనిపై గ్రామాల నుంచి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ ఎస్పీ కింజారపు వెంకట రామకృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో గత 20 రోజులుగా విచారణ చేపట్టి పక్కా ఆధారాలు సేకరించామన్నారు. అనంతరం చింతపల్లి, అన్నవరం, జీకే వీధి, సీలేరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

కనకదుర్గమ్మ తల్లి ప్రచార రథం పర్యటన


చింతపల్లిలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు


పాడేరులో కనకదుర్గమ్మతల్లి ప్రచార రథం

సాక్షి,పాడేరు: విజయవాడలోని కనకదుర్గమ్మతల్లి ధర్మ ప్రచార రథం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో సంచరిస్తుంది. ఈ ప్రచార రథంలో కొలువుదీరిన దుర్గామల్లేశ్వర స్వామి విగ్రహాన్ని భక్తులు దర్శించుకుంటున్నారు. సోమవారం రాత్రి ప్రచార రథం జిల్లా కేంద్రమైన పాడేరు చేరుకోవడంతో భక్తులు పూజలు చేశారు. ఆధ్యాత్మిక వాతావారణం నెలకొంది.

చింతపల్లి: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఏర్పాటు చేసిన హిందూ ధర్మ ప్రచార రథం సోమవారం చింతపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. రథంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. వర్తక సంఘం నాయకులు బేతాలుడు, జోగే శ్వర రావు, రమేష్, రమణ తదితరులు భక్తులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు.

రాజవొమ్మంగి: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం నుంచి మండల కేంద్రం రాజవొమ్మంగి తదితర గ్రామాలకు తరలివచ్చిన దుర్గమల్లేశ్వర స్వామి వారి రథానికి విశేష ఆదరణ లభించింది. ఆయా గ్రామాల్లో భక్తులు రహదారి పొడవునా పూలు జల్లుతూ.. పసుపు కలిపిన నీరు వాపోస్తు రథానికి ఆహ్వానం పలికారు. కనకదుర్గమ్మ పూజలు చేశారు. పురోహితులు మురళీధర శాస్త్రి, మంగళకుమార్ శర్మ, బాల గంగాధర్ శాస్త్రి, హరికృష్ణ, అశ్విని శర్మలు భక్తులకు కుంకుమ బొట్టు పెట్టి అమ్మ వారి ప్రసాదం అందజేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.


ప్రచారరథం వద్ద కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పగిలిన బస్సు కిటికీ అద్దాలు
- ప్రయాణికురాలికి తప్పిన ప్రమాదం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వైపు ఆర్టీసీ బస్‌లో ప్రయాణిస్తున్న జడ్డంగి అన్నవరం గ్రామానికి చెందిన మహిళ గజ్జి అప్పల రాజుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. గోతుల రోడ్డుపై ప్రయాణిస్తున్న బస్సు కిటికీలు పగిలి ఆమెపై పడ్డాయి. ఏలేశ్వరం డిపోకు చెందిన ఈ బస్సు కండీషన్ బాగోలేదని, దీంతో పాటుజడ్డంగి అన్నవరం నుంచి రమణయ్యపేట మధ్య రహదారి పెద్ద పెద్ద గోతులు ఉండడంతో ప్రమాదం జరిగినట్టు ప్రయాణికులు చెప్పారు. ప్రమాదంలో తప్పించుకొని ఆందోళనకు గురైన మహిళను సహచర ప్రయాణికులు సపర్యలు చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామాల్లో పాడైన రహదారులను బాగు చేయాలని, కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని వారు కోరారు.


పగిలిన కిటికీ అద్దాలు


ప్రమాదం నుంచి తప్పించుకొన్న మహిళ

పండగల వేళ ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–విశాఖపట్నం(07097) స్పెషల్ ఈ నెల 15, 22, 29వ తేదీల్లో సాయంత్రం 4.35 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం–సికింద్రాబాద్ (07098) స్పెషల్ ఈ నెల 16, 23, 30వ తేదీల్లో రాత్రి 7.50 గంటలకు విశాఖలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

సికింద్రాబాద్–బ్రహ్మపూర్(07027) సమ్మర్ స్పెషల్ ఈ నెల 13, 20, 27వ తేదీల్లో రాత్రి 8.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.22 గంటలకు దువ్వాడకు, మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–సికింద్రాబాద్(07028) సమ్మర్‌స్పెషల్ ఈ నెల 14, 21, 28వ తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి ఆదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు ఉదయం 11.35 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

రిటైర్డ్ పీడీకి మూడు పతకాలు

చింతూరు: హైదరాబాదులో ఈనెల 8న జరిగిన ఆరవ నేషనల్ సీనియర్ సిటిజన్స్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక రిటైర్డ్ పీడీ మెండు భిక్షం మూడు పతకాలు సాధించారు. 60 ప్లస్ కేటగిరీలో ఆయన డిస్కస్ త్రోలో గోల్డ్, హేమర్ త్రోలో సిల్వర్, షాట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్ కై వసం చేసుకున్నారు.


పతకాలు అందుకుంటున్న రిటైర్డ్ పీడీ భిక్షం

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

- మరొకరికి స్వల్ప గాయాలు
- జైపూర్ జంక్షన్ వద్ద ఘటన


ప్రమాదంలో గాయపడిన యువకులు

డుంబ్రిగుడ: ట్రాక్టర్ ఢీకొని స్కూటీపై వెళ్తున్న ముగ్గురు యువకులు గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని జాతీయ రహదారి జైపూర్ జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొసంగుడ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు స్కూటీపై అరకు వైపు వస్తుండగా జైపూర్ జంక్షన్ వద్ద ఓ ట్రాక్టర్ వెనక భాగం తగలడంతో తుళ్లి పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా.. ఒకరికీ స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రహదారి విస్తరణ పనులు చేపడుతూ అసంపూర్తిగా వదిలేయడంతో ఆంధ్ర–ఒడిశా అంతర్ రాష్ట్ర రహదారితో పాటు, రాజమండ్రి, రాయపూర్ హైవేలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గిరిజనులు వాపోతున్నారు. హైవే అధికారులు స్పందించి రోడ్డులో డివైడర్లను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విజేత.. భీమవరం బుల్లోడే!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి
- తొలి ప్రాధాన్య ఓట్లలోనే గెలుపు
- బడి నుంచి 'మండలి'కి పయనం
- ఆరు గంటల్లోనే ముగిసిన ఓట్ల లెక్కింపు


టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తికి ధ్రువపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి షణ్మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉత్కంఠగా సాగిన గురువుల పోరులో భీమవరం బుల్లోడు విజేతగా నిలిచారు. ఆరు జిల్లాల పరిధిలో హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి గెలుపొందారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల బరిలోకి దిగేందుకు తన వృత్తికి రాజీనామా చేశారు. గోపిమూర్తికి ప్రధాన ప్రత్యర్థిగా ద్రాక్షారామకు చెందిన గంధం నారాయణరావు బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ మిగిలిన ముగ్గురూ నామమాత్రమైన పోటీకే పరిమితమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి చివరి వరకూ బొర్రా, గంధం మధ్యనే నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ కనిపించింది. చివరకు యూటీఎఫ్, పీడీఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగిన గోపిమూర్తికి విజయం వరించింది. గత ఎన్నికల్లో సైతం నారాయణరావు పీడీఎఫ్ అభ్యర్థితో తలపడ్డారు.

సాబ్జీ మృతితో.. : శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. మిగిలిన రెండున్నరేళ్ల పదవీ కాలానికి ఎన్నికల కమిషన్ ఈ ఎన్నిక నిర్వహించింది.

ఆది నుంచీ ఉత్కంఠగా.. : ఈ ఎన్నికలు ఆది నుంచీ తీవ్ర ఉత్కంఠను రేకెత్తించాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు (రంపచోడవరం) జిల్లాల్లో విస్తరించి ఉన్న ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు 15,494 ఓట్లు పోలయ్యాయి. చెల్లుబాటు అయిన మొత్తం ఓట్లను ప్రామాణికంగా తీసుకుని కోటా ఓట్లను 7,341గా నిర్ణయించారు. గోపిమూర్తికి తొలి రౌండ్‌లోనే కోటా ఓట్లు దక్కాయి. దీంతో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఎన్నికల కమిషన్ ఆమోదంతో ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. గోపీమూర్తికి 9,165 ఓట్లు పోలవగా, రెండో స్థానంలో ఉన్న నారాయణరావు 5,259 ఓట్లు దక్కించుకున్నారు. దీంతో 3,906 ఓట్ల ఆధిక్యతతో గోపిమూర్తిని విజయం వరించింది. రెండున్నరేళ్ల పదవీ కాలానికి జరిగిన ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ చివరకు తన స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది.

ఎవరికెన్ని ఓట్లంటే..

బొర్రా గోపిమూర్తి	9,165
గంధం నారాయణరావు	5,259
దీపక్ పులుగు	102
నామన వెంకటలక్ష్మి (విళ్ల లక్ష్మి)	81
డాక్టర్ నాగేశ్వరరావు కవల	73

ఆరు గంటల్లోనే లెక్క తేలింది : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఆరు గంటల్లోనే ముగిసింది. కాకినాడ జేఎన్‌టీయూ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు మొదలై, మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. తొలి రౌండ్‌లోనే మొదటి ప్రాధాన్యతా ఓట్లకే కోటా ఓట్లు రావడంతో గోపిమూర్తిని విజయం వరించింది.

ఉపాధ్యాయుల వాణి వినిపిస్తా.. : ఓట్ల లెక్కింపు అనంతరం గోపిమూర్తి మీడియాతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వాణిని మండలిలో వినిపిస్తానని చెప్పారు. సీపీఎస్ రద్దు పోరాటానికి మద్దతుగా ఉద్యమంలో ముందుంటానని, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం మద్దతుదార్లతో కలసి కాకినాడ యూటీఎఫ్ హోం వరకూ గోపిమూర్తి ర్యాలీగా వెళ్లారు.